క్లుప్తంగా

వైభవంగా వాసవీ హోమం



పెనుగొండ వాసవీ శాంతి థాంలో వాసవీహోమం నిర్వహిస్తున్న దృశ్యం

పెనుగొండ: అఖిల భారత శ్రీ వాసవీ పెనుగొండ ట్రస్ట్ ఆధ్వర్యంలోని పెనుగొండ వాసవీ శాంతి థాంలో వాసవీ హోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బుధవారం ఉదయం 102 రుషీ గోత్ర మందిరంలోని మరకత శిల వాసవీ మాతకు గుంటూరుకు చెందిన పచ్చిపులుసు సూర్యనారాయణ దంపతులు వారి కుటుంబ సభ్యులు అభిషేకాలు, కుంకుమార్చనలు, గోమాత పూజలు నిర్వహించారు. అనంతరం వాసవీ హోమం వైభవంగా నిర్వహించి, పూర్ణాహుతి సమర్పించారు.

ఉచితంగా కంటి శస్త్ర చికిత్సలు



కంటి చికిత్స చేయించిన రోగులతో వసుధ ఫౌండేషన్ కన్వీనర్ పెన్మెత్స బుద్ధరాజు

పాలకొల్లు అర్బన్: వసుధ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక లయన్స్ కంటి ఆసుపత్రిలో బుధవారం ఐదుగురికి ఉచిత కంటి శస్త్ర చికిత్స చేయించారు. ఈ సందర్భంగా లయన్స్ కంటి ఆసుపత్రి చైర్మన్ కేవీఆర్కే నరసింహరావు మాట్లాడుతూ వసుధ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవలను గుర్తు చేశారు. పేదలకు కిడ్నీ, క్యాన్సర్ తదితర శస్త్ర చికిత్సలు చేయించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ కన్వీనర్ పెన్మెత్స బుద్ధరాజు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఆహార పొట్లాల పంపిణీ



పేదలకు ఆహార పొట్లాలు అందజేస్తున్న మానవత స్వచ్ఛంద సంస్థ సభ్యులు

పాలకొల్లు అర్బన్: ఆహారాన్ని వృథా చేయకుండా ఉన్నప్పుడే పేదల ఆకలి తీరుతుందని మానవత స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు ముచ్చర్ల శ్రీనివాస్ అన్నారు. బుధవారం రాత్రి పట్టణంలోని యాచకులకు, పేదలకు మానవత స్వచ్ఛంద సంస్థ ద్వారా ఆహార పొట్లాలు అందజేశారు. ఆకలిని పారదోలడానికి పరిష్కార మార్గాలు కనుగొనే దిశలో ఆహార భద్రత, వ్యవసాయం, కార్యాచరణ వంటివి రూపొందించి అమలు చేయాలని శ్రీనివాస్ చెప్పారు. కార్యక్రమంలో మానవత స్వచ్ఛంద సంస్థ కన్వీనర్ ముత్యాల రామారావు, సభ్యులు శ్రీవాస్తవ ప్రదీప్, ఎంఆర్కే రాజు, పెన్మెత్స కేశవరాజు, తమ్మినీడి మురళీకృష్ణ, విన్నకోట వెంకటరమణ, గుడాల హరిబాబు, బోళ్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ సేవలో మోషేన్‌రాజు



ముత్యాలమ్మ ఆలయ ప్రాంగణంలో రాష్ట్ర శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు

భీమవరం అర్బన్: మండలంలోని దెయ్యాలతిప్ప గ్రామంలోని శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవంలో భాగంగా బుధవారం రాష్ట్ర శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, నరసాపురం పార్లమెంట్ ఎంపీ అభ్యర్థిని గూడూరి ఉమాబాల దర్శనం చేసుకున్నారు. ముందుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులు రాష్ట్ర ప్రజలపై ఉండి సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

పొగాకు దుష్ప్రభావాలపై అవగాహన



పొగాకు దుష్ప్రభావాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): వరల్డ్ నో టొబాకో డే సందర్భంగా డాక్టర్ బీవీ రాజు ఫౌండేషన్ విష్ణు డెంటల్ కాలేజీ-హాస్పిటల్ ఆధ్వర్యంలో వివిధ ప్రజా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా ప్రభుత్వ జనరల్ హాస్పిటల్, భీమవరం వారితో కలిసి బుధవారం టొబాకో అవేర్నెస్ ప్రోగ్రాం నిర్వహించారు. ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌లో ఉన్న పెషెంట్స్‌కి పొగాకు వలన కలిగే ఆరోగ్య సమస్యలు గురించి వివరించారు. డాక్టర్ కేపీఎస్ చైతన్య రామ్, కె.హర్షిత పాల్గొన్నారు

మొగల్తూరు మామిడికి మంచి డిమాండ్

- సీజన్ చివరల్లో వచ్చే బంగినపల్లి రుచే వేరు
- విదేశాలకూ మామిడి పండ్ల పార్శిల్స్

మొగల్తూరు: మొగల్తూరు బంగినపల్లికి మంచి డిమాండ్ ఉంటుంది. ప్రతి ఏటా మామిడి కాయల సీజన్ చివరిలో కోతకు వచ్చే బంగినపల్లి రంగు, రుచిలో మామూలు కాయలకన్నా భిన్నంగా ఉంటుంది. మొగల్తూరు బంగినపల్లికి రాష్ట్ర వ్యాప్తంగా మంచి పేరుంది. ఈ కాయలను దేశ విదేశాల్లో ఉన్న బంధువులకు, స్నేహితులకు పంపిస్తుంటారు. ప్రతి ఏటా మే ఆఖరు నుంచి జూన్ నెల వరకు మొగల్తూరు బంగినపల్లి పేరు మారుమోగుతూ ఉంటుంది. అయితే ఈఏడాది వాతావరణంలో వచ్చిన మార్పులు కారణంగా బంగనపల్లి మామిడి దిగుబడి తగ్గడమే కాకుండా ధరలు కూడా అధికంగా ఉన్నాయి.

మామిడిలో అనేక రకాలు

మండలంలోని సుమారు 600 ఎకరాలు, నరసాపురం మండలంలో సుమారు 2 వేల ఎకరాల్లోను మామిడితోటలు విస్తరించి ఉన్నాయి. ముఖ్యంగా మొగల్తూరు మండలంలో పేరుపాలెం, కేపీ పాలెం, మొగల్తూరు, రామన్నపాలెం, నరసాపురం మండలంలో లక్ష్మణేశ్వరం, రాజుగారితోట, ఎల్‌బీచర్ల, సీతారాంపురం,రుస్తుంబాద, యర్రంశెట్టివారి పాలెం గ్రామాల్లో మామిడి తోటలు విస్తరించి ఉన్నాయి. మామిడి సీజన్ ఆరంభంలో పెద్ద రసాలు, చిన్న రసాలు, చెరకు రసాలు, పంచదార రసాలు, నూజివీడు కొబ్బరి, కొత్తపల్లి కొబ్బరి, పందూరి, కలెక్టర్ రకాలు ముందుగా లభ్యమవుతాయి. కాయల సీజన్ (పచ్చల్లు సీజన్) పూర్తయ్యేటప్పటికీ



మొగల్తూరు మార్కెట్‌లో అమ్మకానికి సంతకు తీసుకువచ్చిన మామిడి పండ్లు



పచ్చి మామిడి కాయలు

నేనున్నానంటూ బంగిన పల్లి మామిడి మార్కెట్‌లోకి ప్రవేశిస్తుంది.

రంగు రుచిలో భిన్నం

సముద్ర తీర ప్రాంత వాతావరణంలో తేమ శాతం ఎక్కువగా ఉండటం వల్ల పండు సైజు, రంగు, రుచి వైవిధ్యంగా ఉంటుంది. బంగిన పల్లి మామిడి పూత ఆలస్యంగా పూయడం వల్ల కాయ దిగుబడి కూడా ఆలస్యమవుతుంది. గత ఏడాది వర్షాలు తక్కువగా కురవడం, వాతావరణంలో మార్పులు కారణంగా ఈఏ డాది ముందుగానే బంగినపల్లి దిగుబడికి వచ్చింది.

చెట్టు పేరు చెప్పి కాయలు అమ్ముతారు

మొగల్తూరు బంగిన పల్లి ఆలస్యంగా మార్కెట్‌లోకి వస్తుందని తెలిసినా ఎగువ ప్రాంతం నుండి వచ్చే కాయలను మొగల్తూరు బంగిన పల్లిగా అమ్మేస్తుంటారు. మొగల్తూరు మార్కెట్ నుంచి నిత్యం సైకిళ్ళపై ద్విచక్ర వాహనాలపై గ్రామాల్లో తిరుగుతూ అమ్ముతారు.

ఈ ఏడాది తగ్గిన దిగుబడి

వాతారణంలో మార్పులు కారణంగా బంగినపల్లి మామిడి దిగుబడి తగ్గింది, గత ఏడాది వర్షాలు తక్కువగా కురవడం, ఎండలు విపరీతంగా కాయడం కూడా దిగుబడిపై ప్రభావం చూపింది

అదరగొడుతున్న ధరలు

మొగల్తూరు మార్కెట్‌కు వచ్చే బంగినపల్లి పండ్లను రకరకాలుగా అమ్ముతారు. కాయ సైజును బట్టి రూ.30 నుండి రూ.70 వరకూ అమ్ముతున్నారు. మొగల్తూరు మార్కెట్‌లో పరక (13)కాయలు సైజును బట్టి రూ.350 నుంచి రూ.520 వరకు ధర పలుకుతుంది. రాబోయే రోజుల్లో ఈ ధరలు మరింత పెరగవచ్చుని రైతులు పేర్కొంటున్నారు. ఇవే కాయలను తోటలోకి వెళ్లి నేరుగా కొనుగోలు చేసుకుంటే ఈ ధర మరింత ఎక్కువగా ఉంటుంది. అయితే మొగల్తూరు బంగినపల్లి మామిడికి ఉన్న రుచితో ఏడాదికి ఒకసారే కదా అనే ఉద్దేశంతో ఎంత ధర వెచ్చించి అయినా కొనుగోలు చేయడానికే మొగల్తూరు మామిడిప్రియులు మక్కువ చూపుతున్నారు.

ఈ ఏడాది దిగుబడి తక్కువ



వాతావరణంలో మార్పుల కారణంగా ఈ ఏడాది దిగుబడి తగ్గింది. తోటలను కౌలుకు తీసుకుని వేలాది రూపాయల మందుల పిచికారీ చేశాం. అయినా కాపు రాకపోవడంతో ఈఏడాది ఆర్థికంగా నష్టపోవాల్సి వస్తుంది.

– మన్నే భోగేష్, కౌలు రైతు, మొగల్తూరు

కిశోర బాలికలు జాగ్రత్తలు పాటించాలి

పెనుగొండ: కిశోర బాలికలు జాగ్రత్తలు పాటించాలని ఐసీడీఎస్ సీడీపీఓ ఎ.కృష్ణకుమారి అన్నారు. బుధవారం పెనుగొండ సెక్టార్ పరిధిలో వేంద్రవారి వీధిలో అంగన్‌వాడీ కేంద్రంలో కిశోర బాలకిల రుత పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా బాలికలకు అవగాహన కల్పించి ర్యాలీ నిర్వహించారు. బాలికలు సరైన పోషకాహారం తీసుకోవాలన్నారు. తల్లిదండ్రులు బాల్య వివాహాలను అరికట్టాలన్నారు. బాలికలు విద్యపై ఆసక్తి చూపాలన్నారు. విద్యతో మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజరు ఎం.విజయకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.



పెనుగొండలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

పాలకొల్లులో..

పాలకొల్లు అర్బన్: కిశోర బాలికలు రుతుస్రావ సమయంలో వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ఏఎన్‌ఎం ఎం మేరి సూచించారు. ప్రపంచ రుతు పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా పాలకొల్లు ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో బుధవారం చందపర్రు, పంది గుంట గ్రామాల్లో కిశోర బాలికలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. రుతుస్రావ సమయంలో కిశోరబాలికలు తీసుకోవలసిన జాగ్రత్తలను సూచించారు. అలాగే కిశోర బాలికలు ఆరోగ్యవంతంగా జీవించడానికి పౌష్టికాహారం తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, సీహెచ్‌వో రాజశ్రీ, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

యలమంచిలిలో..

యలమంచిలి: పరిశుభ్రత పాటిస్తే ఆరోగ్యంగా జీవించవచ్చని దొడ్డిపట్ల పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కె.చంద్రరేఖ, ఏసీడీపీఓ పి.నాగరత్నం అన్నారు. మండలంలోని దొడ్డిపట్లలో రుతుస్రావం వ్యక్తిగత పరిశుభ్రతపై కిశోర బాలికలకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఎండీ హసీనా, ఏఎన్‌ఎం ఎం నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



పాలకొలు అర్బన్: పందిగుంటలో కిశోర బాలికలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం



పాలకొలు అర్బన్: చందపర్రులో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది



యలమంచిలి: దొడ్డిపట్లలో అవగాహన ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి



ఆర్‌బీకే ఇన్‌చార్జ్‌లతో మాట్లాడుతున్న ఏడీఏ ఈదా అనిల్‌కుమారి

యలమంచిలి: సార్వా పంటకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని రైతు భరోసా కేంద్రాల ఇన్‌చార్జ్‌లకు ఏడీఏ ఈదా అనిల్‌కుమారి సూచించారు. మండలంలోని మేడపాడు రైతు భరోసా కేంద్రం వద్ద బుధవారం రైతు భరోసా కేంద్రాల ఇన్‌చార్జ్‌లతో నిర్వహించిన సమావేశంలో ఏడీఏ మాట్లాడారు. రైతులతో చర్చించి అవసరమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచుకునే ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం రైతు భరోసా కేంద్రాల వద్ద పచ్చి రొట్ట పైర్లు పిల్లిపెసర, జనుము, జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ సీహెచ్ దేవి తదితరులు పాల్గొన్నారు.

మంచినీరు సక్రమంగా అందించాలి

పాలకొల్లు అర్బన్: గ్రామాల్లో ప్రజలకు మంచినీరు సక్రమంగా అందించడంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంపీపీ చిట్టూరి కనకలక్ష్మి కోరారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం స్థానిక జీఎంసీ బాలయోగి సమావేశ మందిరంలో ఎంపీపీ కనకలక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో కనకలక్ష్మి మాట్లాడుతూ ఇరిగేషన్ అధికారులు బాధ్యతగా పనిచేసి రానున్న సార్వా పంటకు సాగునీరు సక్రమంగా అందించడానికి పంటకాలువలు మరమ్మతులు చేయించి చెత్తాచెదారాలను తొలగించాలని కోరారు. వర్షాకాలంలో విద్యుత్ వైర్లు తెగిపోకుండా అవసరమైన ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న కారణంగా అభివృద్ధి పనులపై చర్చను నిలుపుదల చేస్తున్నట్లు ఎంపీడీఓ ఎం.అనుపమ చెప్పారు. గత సమావేశంలో దిగమర్రు పంట కాలువలోకి మునిసిపల్ పరిధిలోని డ్రెయిన్‌లు కలపడంపై దిగమర్రు సర్పంచ్ రాపాక కరుణాకర్ చేసిన ఫిర్యాదుపై జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లినట్లు చెప్పారు. అలాగే స్థానిక ఏరియా ఆసుపత్రిలో గైనకాలజిస్టు సమస్యను కూడా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లడంతో ఇరువురు గైనకాలజిస్టుని నియమించినట్లు సభ్యుల దృష్టికి తీసుకు వచ్చారు. పాలకొల్లు మండలం ఈ ఏడాది పదో తరగతి పరీక్షా ఫలితాల్లో గతం కంటే ఎక్కువగా 81 శాతం మంది ఉత్తీర్ణత సాధించారని దీనికి కృషి చేసిన మండల విద్యాశాఖ అధికారులను సమావేశంలో ఎంపీపీ కనకలక్ష్మి, సభ్యులు ప్రత్యేకంగా అభినందించారు. చింతపర్రులో లో-ఓల్టేజి సమస్య కారణంగా స్థానిక ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందని, కనీసం ఫ్యాన్‌లు కూడా తిరగడం లేదని ఆ గ్రామ సర్పంచ్ గుమ్మాపు పెద్దిరాజు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఎలక్ట్రికల్ ఏఈ సత్యనారాయణ వివరణ ఇస్తూ గ్రామంలో ఇంతకు ముందు 100 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి సమస్యను కొంత వరకు పరిష్కరించామన్నారు. 63 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కి ప్రతిపాదనలు పంపించినట్లు వివరణ ఇచ్చారు. మండల పరిషత్ కోఆప్షన్ సభ్యులు తండా ఇస్సాక్‌రాజు మాట్లాడుతూ శివదేవునిచిక్కాలలో విద్యుత్, ఇరిగేషన్ అధికారుల సహకారంతో ప్రత్యేక ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడం వలన 500 ఎకరాలకు సాగునీరు అందిందని, దీనికి సహకరించిన జిల్లా కలెక్టర్, శ్రీరాఘవేంద్ర ఛారిటబుల్ ట్రస్ట్ వారికి ప్రత్యేక ధన్యవాదలు తెలిపారు. బోరు వాటర్ ఇవ్వడం వల్ల దగ్గులూరు గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మండల పరిషత్ ప్రతిపక్ష నాయకుడు శాగ సత్యనారాయణ సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. వర్షాలు పడుతున్న కారణంగా విష జ్వరాలు ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, పంచాయతీలో దోమల నివారణకు స్ప్రే చేయడానికి దోమల మందు సిద్ధంగా ఉందని ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు చెప్పారు. సమావేశంలో వైస్ ఎంపీపీ పడవల సునీల్‌బాబు, ఎంపీటీసీ సభ్యులు పెదపాటి వెంకటరత్నం, ఆకుల ధనలక్ష్మి, మామిడిశెట్టి లలితకుమారి, గెద్దం కుటుంబరావు, ఏవో కె గోవిందరాజులు, ఎంఈఓ ఆర్ఎస్వీఎస్ గంగాధరశర్మ, సర్పంచ్‌లు, విశ్వనాథం కనకభద్రం, కవురు భారతి, సీడీపీఓ సీహెచ్ ఇందిర తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ చిట్టూరి కనకలక్ష్మి

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 12 మంది విద్యార్థులు ఎంపిక

పాలకొల్లు సెంట్రల్: స్థానిక బీఆర్ఆర్ అండ్ జీకేఆర్ చాంబర్స్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో బుధవారం నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 12 మంది చాంబర్స్ విద్యార్థులు ఎంపికయ్యారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కళాశాలలో సినర్జీస్ కంపెనీ నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 57 మంది విద్యార్థులు హాజరవ్వగా 12 మంది ఎంపికయ్యారన్నారు. ఇంటర్వ్యూల్లో ఎంపికైన విద్యార్థులకు రూ. 20 వేలు వేతనం ఉంటుందన్నారు. విద్యార్థులను రాతపరీక్ష, హెచ్‌ఆర్ ఇంటర్వ్యూల ద్వారా ఎంపిక చేసినట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల చైర్మన్ కారుమూరి వెంకట నరసింహరావు అభినందించి ఆఫర్ లెటర్స్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ కలిదిండి రామరాజు, కంపెనీ సిఈవో నల్ల దినేష్, హెచ్‌ఆర్ నవ మణికంఠ, కళాశాల ప్లేస్‌మెంట్ ఇన్‌చార్జ్ కె.లక్ష్మణరావు, ట్రైనర్ కె.సంతోష్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



క్యాంపస్ ఇంటర్వ్యూల్లో సెలెక్ట్ అయిన విద్యార్థినులు

స్వర్ణాంధ్ర పాలిటెక్నిక్‌లో జాబ్ అచీవర్స్‌డే

నరసాపురం రూరల్: మండలంలోని సీతారామపురం స్వర్ణాంధ్ర పాలిటెక్నికల్ కళాశాలలో బుధవారం అచీవర్స్‌డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వర్ణాంధ్ర కళాశాలల చైర్మన్ కె.సత్యనారాయణమాట్లాడుతూ అతి పిన్న వయస్సులోనే ఉద్యోగం చేయగల సాంకేతిక నైపుణ్యం కేవలం పాలిటెక్నిక్ విద్యతోనే సాధ్యమని అన్నారు. 2024 ఫిబ్రవరి నుంచి కళాశాలలో నిర్వహించిన వివిధ క్యాంపస్ ఇంటర్యూలలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన 97 మంది విద్యార్థులకు ఉద్యోగాలు సాధించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ విద్యాసంవత్సరం నుంచి డీసీఎంఈ బ్రాంచ్‌కు 270 సీట్లకు పెంచినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యోగావకాశాలు సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు. తొలుత ఉద్యోగాలు సాధించిన విద్యార్థులకు ఆయా కంపెనీల ప్రతినిధులు ఆఫర్ లెటర్స్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల కోశాధికారి కేవీ స్వామి, పాలకవర్గ సభ్యుడు అద్దాల శ్రీహరి, ప్రిన్సిపాల్స్ డాక్టర్ కిరణ్మయి, డాక్టర్ సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రావిపాడు ఘటనపై విచారణ చేయాలి

భీమవరం: పెంటపాడు మండలం రావి పాడు గ్రామంలో దళితులపై పోలీస్‌ల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు, జిల్లా ఎస్సీ, ఎస్టీ, విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు చీకటిమిల్లి మంగరాజు అన్నారు. బుధవారం భీమవరంలో జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పొన్నమండ బాలకృష్ణ, చెవ్వకుల భరత్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. 40 ఏళ్లగా రావిపాడు గ్రామంలోని ఇరిగేషన్ భూమిలో అంబేడ్కర్ జయంతి, వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించుకుంటుంటే అదే స్థలంలో కొంత మంది ఆక్రమించుకుని గడ్డివాములు వేసుకొని స్థలాన్ని కబ్జా చేసుకోవడమే గాక అదే గ్రామానికి చెందిన మిలటరీ వ్యక్తికి పట్టా ఇచ్చారంటూ ఇంటి నిర్మాణం చేపట్టగా విషయాన్ని పెంటపాడు తహసీల్దార్‌కు దళితులు విన్నవించుకున్నా ఎన్నికల కోడ్ పేరుతో జాప్యం చేయడం వల్ల వివాదం పెరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు.

పెంటపాడు వివాదాన్ని సామరస్యంగా పరిష్కరించాలి

భీమవరం: పెంటపాడు మండలం రావిపాడు గ్రామంలో దళిత పేటలో స్థల వివాదం అధికారుల జాప్యమే కారణమని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె క్రాంతిబాబు ఆరోపించారు. బుధవారం భీమవరంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశం కేవీపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి సిహెచ్ చిన్న నాగేశ్వరరావుతో కలిసి మాట్లాడారు. రావిపాడు గ్రామంలో దళిత పేటకు ఆనుకొని ఉన్న ఇరిగేషన్ భూమిని సుమారు 40 ఏళ్లగా దళితులు ఉపయోగించుకుంటున్నారని దీనికి అంబేడ్కర్ యూత్ సొంత ఖర్చులతో స్థలాన్ని అభివృద్ధి చేసుకున్నారన్నారు. ఆ స్థలంలో అదే గ్రామానికి చెందిన సైనిక అధికారికి 3 సెంట్లు ఇంటి స్థలం కేటాయించడంతో ఇల్లు నిర్మించడం వలన వివాదం తలెత్తిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడ వివాదాన్ని ఎన్నికల కోడ్ పేరుతో అధికారులు అలసత్వం వహించడం వల్లనే వివాదం ముదిరిందని క్రాంతిబాబు ఆరోపించారు. సైనిక కుటుంబానికి అధికారులు న్యాయం చేయాలని, స్థలం కేటాయించి ప్రభుత్వమే ఇంటి నిర్మాణం చేసి ఇవ్వాలని, దళితులు అభివృద్ధి చేసుకొని ఉపయోగించుకుంటున్న ఆ స్థలాన్ని దళితులు యధావిధిగా వాడుకోవడానికి అనుమతి ఇవ్వాలని కోరారు.

పందులు, పశువులను రోడ్లపైకి వదలొద్దు

నరసాపురం: పట్టణంలో రోడ్లపై పశువులు, పందులు తిరుగుతున్నట్టుగా ఫిర్యాదులు వస్తున్నాయని మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ చెప్పారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ యజమానులు పందులు, పశువులను రోడ్లపైకి వదిలితే మున్సిపల్ ప్రజారోగ్య చట్టం ప్రకారం యజమానులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పందులు, పశువులను వేరే ప్రాంతాలకు తరలించడంతో పాటుగా భారీగా జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. పందులు, పశువులు రోడ్లపైకి రాకుండా కట్టడి చేసుకోవాలని చెప్పారు.

ఆర్టీసీ కార్గో సర్వీస్‌లను వినియోగించుకోవాలి

నరసాపురం: ఆర్టీసీ కార్గో డోర్ డెలివరీ సర్వీస్‌లను సద్వినియోగం చేసుకోవాలని నరసాపురం ఆర్టీసీ డిపో మేనేజర్ ఎస్.సుబ్బన్నరెడ్డి సూచించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆర్టీసీ కార్గో సర్వీస్ ద్వారా సరుకుల రవాణా తక్కువ చార్జీలతో అందిస్తామన్నారు. 50 కిలో బరువున్న పార్సిల్స్‌ను 10 కిలోమీటర్ల వరకూ డోర్ డెలివరీ చేయడానికి సంస్థ సదుపాయం కల్పించిందని చెప్పారు. డోర్ డెలివరీ సర్వీస్‌లను ప్రోత్సహించడానికి ప్రజలకు అవగాహన కల్పించేందుకు గానూ పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.

నేడు గ్రామదేవతల తీర్థ మహోత్సవం

పెనుగొండ: పెనుగొండ గ్రామ దేవతలు కోట్లమ్మ, మారేమ్మల తీర్థ మహోత్సవం గురువారం అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. జాతర మహోత్సవం సోమవారం అత్యంత వైభవంగా ప్రారంభించారు. సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకూ గరగ నృత్యాలతో గ్రామోత్సవం కనుల పండువగా నిర్వహించారు. అనంతరం గ్రామంలో మంగళవారం అమ్మవార్లకు నైవేద్యాలు సమర్పించారు. నాలుగో రోజు గురువారం ఉదయం నుంచి కోట్లమ్మ, మారేమ్మల దర్శనం ఏర్పాటు చేసి తీర్థ మహోత్సవం నిర్వహిస్తారు, దీనిలో భాగంగా ఆలయం వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

మృతుని కుటుంబానికి పరామర్శ



రవి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల గోపి

యలమంచిలి: యలమంచిలి మండలం కొంతేరులో అనారోగ్యంతో మృతి చెందిన ఉన్నమట్ల రవి కుటుంబ సభ్యులను వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) పరామర్శించారు. పార్టీకి ఎంతో కష్టపడి పనిచేసిన రవి ఆకస్మికంగా మృతి చెందడం బాధాకరమన్నారు. కుటుంబ సభ్యులకు అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందిస్తానన్నారు. పార్టీ నాయకులు కూడా రవి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

పంట కాలువలు, డ్రెయిన్లను ఆధునికీకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

భీమవరం: సాగునీటి కాలువలు, మురుగు నీటి డ్రెయిన్స్‌ను గడిచిన 15 ఏళ్లుగా ఆధునికరించకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కమిటీ సమావేశం ఆందోళన వ్యక్తం చేసింది. బుధవారం భీమవరం పట్టణంలో జిల్లా అధ్యక్షుడు జుత్తిగ నర్సింహమూర్తి అధ్యక్షతన నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో సంఘం నాయకుడు వై.కేశవరావు మాట్లాడుతూ త్వరలో నూతనంగా బాధ్యతలు చేపట్టే ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయడంతో పాటు, జిల్లాలో ఉన్న సాగునీటి కాలువలు, మురుగు కాలువలు ప్రక్షాళనకు తక్షణమే చర్యలు చేపట్టాలన్నారు. రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల హరేరామ్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని అక్విడెట్లు, లాకుల తలుపులకు వెంటనే మరమ్మతులు చేపట్టాలన్నారు. రైతు భరోసా కేంద్రాల వద్ద సబ్సిడీపై విత్తనాలు అందుబాటులో ఉంచాలని, ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యానికి వెంటనే రైతుల బ్యాంకు ఖాతాల్లో సొమ్ములు జమచేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో యాతం రాంబాబు, కిలారి తవిటినాయుడు, చీర్ల పుల్లారెడ్డి, గండికోట వెంకటేశ్వరావు పాల్గొన్నారు.